జ్వాల తెలుగు న్యూస్

RNI NO: TELTEL/2023/88524

# మెదక్ టుడే

MEDAK TODAY తెలుగు దిన పత్రిక...

11 ఏప్రిల్ 2026 | మెదక్ | పేజీలు :4 వెల రూ.:2 | ఎడిటర్: సిహెచ్. శివకుమార్ | సంపుటి 02 | సంచిక 131

## గగన్‌యాన్ 'ఎయిర్ డ్రాప్' టెస్ట్ సక్సెస్

**అంతరిక్షంలో భారత్ ముందడుగు!**
**వ్యోమగాముల భద్రతకు భరోసా**
**శ్రీహరికోటలో విజయవంతమైన ఐఏడీఏటీ-02 ప్రయోగం**




*గగన్‌యాన్ మిషన్‌లో వ్యోమగాములు ప్రయాణించే లి'క్రూ మాడ్యూల్'లి నింగి నుంచి భూమికి తిరిగి వచ్చేటప్పుడు ఎంత సురక్షితంగా ల్యాండ్ అవుతుందో పరిశీలించే పరీక్షే ఈ 'ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డ్రాప్ టెస్ట్' వ్యోమగాముల రక్షణ మరియు పారాచూట్ వ్యవస్థ పనితీరును పరీక్షించడమే ప్రధాన లక్ష్యం అత్యవసర సమయాల్లో సిబ్బందిని సురక్షితంగా తప్పించే సామర్థ్యాన్ని ఇది నిర్ధారిస్తుంది.*

## మత్తు కోరల్లో...

# మణిదీపాలు

## గంజాయిని మృత్యుపాశంగా మార్చిన మాఫియా




**చిద్రమవుతున్న యువత భవిష్యత్తు**
**మెట్రోల నుంచి పల్లె గడపల వరకు..**
**'గంజాయి' నిశ్శబ్ద దండయాత్ర**
**డిగ్రీలు ఉన్నా.. డ్రగ్స్ ఉచ్చులో పడ్డా విద్యావంతుల వివేకం ఏమైంది?**
**తక్కువ ధర.. ఎక్కువ మత్తు:**
**ఈగల్ సర్వే షాకింగ్ రిపోర్ట్:**
**మూడు ఏళ్లు..**
**21 వేల మంది అరెస్ట్!**

**హైదరాబాద్ డెస్క్ ఏప్రిల్ 10:** రంగుల కలలతో సాగిపోవాల్సిన యువత ప్రస్తుతం మత్తు ఊబిలో కూరుకుపోతోంది. ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాల్సిన వయస్సులో మత్తుకు బానిసవుతూ తమ జీవితాలను అంధకారం చేసుకుంటున్నారు. ఒకప్పుడు కేవలం మహానగరాలకే పరిమితమైన మాదక ద్రవ్యాల వినియోగం నేడు పల్లెలకు కూడా ఎగబాకడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. మత్తు సామ్రాజ్యాన్ని కూకటి వేళ్లతో పెకిలించేందుకు రంగంలోకి దిగిన ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఈగల్) ఫోర్స్ తాజా సర్వేలో విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి.

మహమ్మారిలా గంజాయి రక్కసి

గంజాయి మత్తు ఇప్పుడు ఒక మహమ్మారిలా వ్యాపిస్తోంది. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా తెలంగాణను కమ్మేస్తోంది. ముఖ్యంగా యువత ఈ డ్రగ్స్ రక్కసి కోరల్లో చిక్కుకుని విలవిల్లాడుతున్నారు. హెరాయిన్, కొకైన్ వంటి ఖరీదైన మత్తు పదార్థాలు కొనడం సామాన్యులకు సాధ్యం కాకపోవడంతో, మత్తు మాఫియా తక్కువ ధరకే లభించే గంజాయిని విచ్చలవిడిగా

మిగతా 2లో




## దేశంలోనే తొలి డిజిటల్...

# జనగణన సందడి

**ఐదు లక్షల పైచిలుకు కుటుంబాల స్వీయ నమోదు**
**ప్రజా భాగస్వామ్యంతో సరికొత్త చరిత్ర**
**తెలుగు నేలపై జనగణన సందడి**
**ఏపీ, తెలంగాణలో కీలక గడువులివే**
**ఏప్రిల్ 16 నుంచి ఆంధ్రులకు..**
**26 నుంచి తెలంగాణ వాసులకు**
**'స్వీయ నమోదు' అవకాశం**


**ఢిల్లీ ఏప్రిల్ 10:** భారతదేశం తన మొట్టమొదటి డిజిటల్ జనగణన దిశగా అడుగులు వేస్తోంది. స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత జరుగుతున్న ఎనిమిదవ గృహ గణన ప్రక్రియలో ప్రజలు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా ఐదు లక్షల డెబ్బై రెండు వేల కంటే ఎక్కువ కుటుంబాలు తమ వివరాలను ఆన్‌లైన్ ద్వారా స్వయంగా నమోదు చేసుకున్నాయని భారత రిజిస్ట్రార్ జనరల్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ వెల్లడించారు. దేశ నిర్మాణంలో ప్రజలు డిజిటల్ మార్గాన్ని ఎంచుకోవడం ఆధునిక భారత్ అభివృద్ధికి నిదర్శనమని ఆయన కొనియాడారు.

**ప్రక్రియ సాగుతున్న తీరు:** ఏప్రిల్ ఒకటవ తేదీన ఐదు రాష్ట్రాలు మరియు మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ గృహ గణన ప్రారంభమైంది. గోవా, కర్ణాటక, మిజోరాం, ఒడిశా, సిక్కిం వంటి రాష్ట్రాలతో పాటు ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో ప్రస్తుతం ఈ ప్రక్రియ కొనసాగుతోంది. ఈ ప్రాంతాల నివాసితులు ఏప్రిల్ 15వ తేదీ వరకు స్వయంగా తమ వివరాలను అంతర్జాల పోర్టల్ ద్వారా నమోదు చేసుకోవచ్చు. ఇలా నమోదు చేసుకున్న వారికి ఒక ప్రత్యేక గుర్తింపు సంఖ్య లభిస్తుంది. అనంతరం ఏప్రిల్ 16 నుంచి మే 15 వరకు ప్రభుత్వ సిబ్బంది ప్రతి ఇంటికి వచ్చి వివరాలను ధృవీకరిస్తారు. అప్పుడు ప్రజలు తమ వద్ద ఉన్న గుర్తింపు సంఖ్యను వారికి చూపిస్తే సరిపోతుంది.

**తెలుగు రాష్ట్రాల షెడ్యూల్:** ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ వేర్వేరు తేదీలలో జరగనుంది.
ఆంధ్రప్రదేశ్: మన రాష్ట్రంలో ప్రజలు

మిగతా 2లో

## దేశ భద్రతలో రాజీ లేదు




**చొరబాటుదారులపై ఉక్కుపాదం**
**గుర్తించడం.. తొలగించడం.. బహిష్కరించడం!**
**సరిహద్దులకు రక్షణ కవచం**
**అక్రమ రవాణాకు స్మగ్లింగ్‌కు శాశ్వత విరుగుడు**
**జీరో టాలరెన్స్ విధానంతో కఠిన చర్యలు**

*రాష్ట్రంలోని ప్రతి మహిళకు మరియు నిరుద్యోగ యువతకు నెలకు లిరూ.3,000లి చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని వాగ్దానం చేసింది. పోలీసు విభాగంతో సహా అన్ని ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లులి కల్పిస్తామని స్పష్టం చేసింది.*




## జల విషాదం

**యమునా నదిలో పడవ బోల్తా.. 10 మంది మృతి**

## మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్

# సంపూర్ణ మద్దతు



**డీలిమిటేషన్‌తో లింకు ఎందుకు?' అని ప్రశ్న**
**ఓబీసీ కోటా అమలు చేయాలని డిమాండ్**
**ఉత్తర-దక్షిణాది మధ్య అంతరం పెంచుతున్న బీజేపీ!**
**సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు**

**న్యూఢిల్లీ ఏప్రిల్ 10:** మహిళా రిజర్వేషన్ల అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ వైఖరిని స్పష్టం చేశారు. మహిళలకు రిజర్వేషన్లు తీసుకువచ్చిన ఘనత కాంగ్రెస్‌దేనని, ఈ బిల్లుకు తమ పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందని ఆయన ప్రకటించారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ భేటీ అనంతరం ఢిల్లీలో మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడిన ఆయన, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.

**మహిళా సాధికారతకు కాంగ్రెసే పునాది**

స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించి, వారిని రాజకీయంగా బలోపేతం చేసింది దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీ అని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. గతంలోనే సోనియాగాంధీ ఈ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టారని, మహిళా రిజర్వేషన్ల పట్ల కాంగ్రెస్ నిబద్ధతతో ఉందని పేర్కొన్నారు.

బిజేపీ వ్యూహంపై ప్రశ్నల వర్షం

మహిళా రిజర్వేషన్ల అమలులో కేంద్రం అనుసరిస్తున్న తీరును రేవంత్ రెడ్డి తప్పుపట్టారు డీలిమిటేషన్ అడ్డంకి

మిగతా 2లో

## జగిత్యాల రాజకీయాల్లో పెను మార్పు




**గులాబీ గూటికి జీవన్‌రెడ్డి.. కేసీఆర్ ఆత్మీయ సత్కారం**
**గతాన్ని మర్చి.. భవిష్యత్తు కోసం చెయ్యి కలిపి**
**రైతుల పక్షాన మళ్ళీ గులాబీ గర్జన: జీవన్‌రెడ్డి**
**రాకతో రెట్టింపైన బీఆర్ఎస్ బలం**
**'అన్నా.. మీతో పనిచేయమని దేవుడే పంపిండు' అంటూ మాజీ మంత్రి ఆవేదన**

# తుపాకీ వీడి.. ప్రగతి బాట పట్టి

**అడవి నుంచి అడుగులు జనజీవన స్రవంతి వైపు**
**తెలంగాణలో నామమాత్రంగా మావోయిస్టులు**
**గణాంకాలతో సహా వెల్లడించిన డీజీపీ**
**ఆయుధాల అప్పగింత.. ఆశయాల మార్పు**
**42 మంది మావోయిస్టుల సంచలన నిర్ణయం**
**శిక్ష కాదు.. పునరావాసం**
**రూ. 1.93 కోట్లు, హెల్త్ కార్డులతో మాజీ మావోలకు స్వాగతం**



**హైదరాబాద్: ఏప్రిల్ 10:** తెలంగాణలో మావోయిస్టు పార్టీ ఉనికికి కోలుకోలేని దెబ్బ తగిలింది. అడవిని వీడి జనజీవన స్రవంతిలో కలిసేందుకు భారీ సంఖ్యలో మావోయిస్టులు తరలివచ్చారు. మంగళవారం తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో ఏకంగా 42 మంది మావోయిస్టులు లొంగిపోయారు. ఇందులో 11 మంది పీఎల్జీఏ (గ్రా+గూ) బెటాలియన్ సభ్యులు ఉండటం, ముఖ్యంగా బెటాలియన్ కమాండర్ సోది కేశాలు పోలీసుల ఎదుట లొంగిపోవడాన్ని భద్రతా బలగాలు ఒక చారిత్రాత్మక విజయంగా భావిస్తున్నాయి.

అదును చూసి ఆయుధాలు వీడి..

ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా బలగాల 'ఆపరేషన్ కగార్' ఉధృతం కావడం, కర్రెగుట్టల్లో కూంబింగ్ ముమ్మరం చేయడంతో మావోయిస్టు క్యాడర్ చెల్లాచెదురైంది. అగ్రనేతల ఎన్‌కౌంటర్లు, పటిష్టమైన పోలీస్ నిఘా వెరసి మనుగడ కష్టమవ్వడంతో వీరంతా తెలంగాణ పోలీసులను ఆశ్రయించారు. లొంగిపోయిన వారిలో అత్యధికంగా ఛత్తీస్‌గఢ్ క్యాడర్ వారే ఉండగా, తెలంగాణకు చెందిన కొంజం విడుమాల్ (మహేందర్) అనే వ్యక్తి మాత్రమే ఉన్నారు. ఏకే-47 వంటి అత్యాధునిక ఆయుధాలను వీరు

మిగతా 2లో

## జగిత్యాల రాజకీయాల్లో పెను మార్పు

**ఎర్రవెల్లి: ఏప్రిల్ 10:** తెలంగాణ రాజకీయ యవనికపై ఒక అరుదైన, అత్యంత భావోద్వేగభరిత ఘట్టం ఆవిష్కృతమైంది. దశాబ్దాల రాజకీయ ప్రస్థానం, ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేసే ధీశాలి, మాజీ మంత్రి లితాటిపర్తి జీవన్‌రెడ్డి.. బీఆర్ఎస్ అధినేత లికేసీఆర్‌లితో భేటీ అయ్యారు. ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసంలో శుక్రవారం జరిగిన ఈ కలయిక కేవలం రెండు రాజకీయ ధృవాల కలయికగానే కాకుండా, ఇద్దరు పాత మిత్రుల ఆత్మీయ సంగమంగా నిలిచిపోయింది.

**కంటతడి పెట్టిన జీవన్‌రెడ్డి.. ఆత్మీయంగా హత్తుకున్న కేసీఆర్**

కేసీఆర్‌ను చూడగానే జీవన్‌రెడ్డి ఒక్కసారిగా భావోద్వేగానికి లోనయ్యారు. కేసీఆర్ చేతులు పట్టుకుని మనసులోని మాటను బయటపెట్టారు. “అన్నా.. నన్ను మీతో కలిసి పనిచేయమని దేవుడే పంపిండు. తెలంగాణకు నష్టం జరుగుతున్న ఈ క్లిష్ట సమయంలో మీతో కలిసి నడవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. చాలా గ్యాప్ తర్వాత ఇన్నాళ్లకైనా మీతో కలిసి పనిచేసే అవకాశం రావడం నా అదృష్టం అన్నా..”

తాటిపర్తి జీవన్‌రెడ్డి

ఆయన మాటలకు చలించిన కేసీఆర్, జీవన్‌రెడ్డిని ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని హృదయపూర్వకంగా ఆలింగనం చేసుకున్నారు. శాలువాతో సత్కరించి, సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

**ఘన స్వాగతం పలికిన కేటీఆర్**

తొలుత ఎర్రవెల్లి నివాసానికి చేరుకున్న జీవన్‌రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ లికేటీఆర్‌లి పుష్పగుచ్ఛం అందించి ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం నేరుగా కేసీఆర్ వద్దకు తోడ్కొని వెళ్లారు. ఈ భేటీలో మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, వేముల ప్రశాంత్‌రెడ్డి సహా పలువురు ముఖ్య నేతలు పాల్గొన్నారు. జీవన్‌రెడ్డి వెంట ఆయన కుమారులు, జగిత్యాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ వసంతాసురేశ్ దంపతులు కూడా ఉన్నారు.

**లంచ్ మీటింగ్‌లో రాష్ట్ర ప్రయోజనాలపై చర్చ**

ఆత్మీయ పలకరింపుల అనంతరం జీవన్‌రెడ్డి బృందానికి కేసీఆర్ విందు ఇచ్చారు. భోజనం చేస్తూనే రాష్ట్రంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ముఖ్యంగా రైతాంగ సమస్యలు మరియు తెలంగాణ ప్రయోజనాలపై ఇద్దరు నేతలు సుదీర్ఘంగా చర్చించారు. రైతు పక్షపాతులుగా పేరున్న ఇద్దరు అగ్రనేతలు ఒకే తాటిపైకి రావడం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

## మత్తు కోరల్లో ‘మణిదీపాలు

సరఫరా చేస్తోంది. ప్రధానంగా 26 నుంచి 35 ఏళ్ల లోపు ఉన్న యువతే ఎక్కువగా ఈ మత్తుకు బానిసలవుతున్నారని ఈగల్ ఫోర్స్ సర్వే స్పష్టం చేసింది.

**విద్యావంతులూ అదే బాటలో..**

ఈగల్ ఫోర్స్ పట్టుకున్న నిందితుల వివరాలు చూస్తే ఎవరైనా విస్తుపోవాల్సిందే. గత మూడేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన దాడుల్లో ఏకంగా 21,201 మంది నిందితులు పోలీసులకు చిక్కారు. ఇందులో 639 మంది మహిళలు ఉండటం గమనార్హం. పట్టుబడిన వారిలో దాదాపు 35 శాతం మంది డ్రగ్స్ వినియోగదారులే.

మరీ ముఖ్యంగా, విద్యావంతులు ఈ ఊబిలో చిక్కుకోవడం కలచివేస్తోంది. అరెస్ట్ అయిన వారిలో 11,682 మంది అండర్ గ్రాడ్యుయేట్లు ఉండగా, 3,307 మంది గ్రాడ్యుయేట్లు, 890 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్లు ఉన్నారు. చదువుకుని ఉన్నత స్థితికి చేరుకోవాల్సిన మేధావులు కూడా మత్తుకు దాసోహమనడం రాష్ట్ర భవిష్యత్తుపై నీలినీడలు పరుస్తోంది. నిందితుల్లో తెలంగాణకు చెందిన వారు 16,592 మంది ఉండగా, అంతర్రాష్ట్ర నేరస్థులు 4,544 మంది, మరో 65 మంది అంతర్జాతీయ నేరస్థులు ఉన్నారు.

**ఉక్కుపాదం మోపుతున్న ఈగల్ ఫోర్స్**

2023లో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన యాంటీ నార్కోటిక్స్ బ్యూరోనే కొన్ని నెలల కిందట ‘ఈగల్ ఫోర్స్’గా రూపాంతరం చెందింది. గోవా, ఢిల్లీ, ముంబై వంటి మెట్రో నగరాల నుంచి వస్తున్న ఖరీదైన డ్రగ్స్‌పై నిఘా పెడుతూనే, ఒడిశా నుంచి తెలంగాణ పల్లెల్లోకి చొరబడుతున్న గంజాయి మూలాలపై ఈ ఫోర్స్ ఉక్కుపాదం మోపుతోంది. హైదరాబాద్ శివార్లలో అక్రమంగా సాగుతున్న అల్ప్రాజోలం తయారీ కేంద్రాలపై ప్రత్యేక దాడులు నిర్వహిస్తూ సరఫరాదారుల గుండెల్లో నిద్రపోతోంది.

**నిపుణుల హెచ్చరిక: అవగాహనే శ్రీరామరక్ష**

మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలపై సరైన అవగాహన లేకపోవడమే యువత ఈ దారి పట్టడానికి ప్రధాన కారణమని నిపుణులు చెబుతున్నారు. విశ్రాంత అదనపు ఎస్పీ రెడ్డన్న ఈ విషయంపై స్పందిస్తూ.. “డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలను ప్రభుత్వం, పోలీసులు, మీడియా విపరీతంగా ప్రచారం చేయాలి. విద్యాభ్యాసంలోనే ప్రాథమిక స్థాయి నుంచి ప్రత్యేక పాఠాలు బోధించాలి. విద్యార్థులు మార్కుల కోసమైనా వీటి గురించి చదువుతారు, తద్వారా అది ఎంత ప్రమాదకరమో తెలుసుకుంటారు. ప్రత్యేక కోర్టులు, షార్ట్ ఫిలిమ్స్, నాటకాల ద్వారా అవగాహన కల్పిస్తే తప్ప వినియోగం తగ్గదు” అని అభిప్రాయపడ్డారు.

లిముగింపు:లి మత్తు లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా కదలాల్సిన సమయం ఆసన్నమైంది. పటిష్టమైన చట్టాలు, విస్తృతమైన అవగాహనతోనే ఈ మత్తు రక్కసిని తరిమికొట్టడం సాధ్యమవుతుంది.

## ప్రేమ ముసుగులో ఉన్మాదం..

**ఖాజీపేట (కడప జిల్లా):** ఏప్రిల్ 10: కడప జిల్లా ఖాజీపేట మండల కేంద్రంలో శుక్రవారం పట్టపగలే ఘోరం జరిగింది. అగ్రహారానికి చెందిన కీర్తన అనే ఇంటర్మీడియట్ విద్యార్థిని, ఆవుల వెంకటేష్ అనే ప్రేమోన్మాది చేతిలో బలయ్యింది. నిందితుడు అత్యంత కిరాతకంగా విద్యార్థిని గొంతుకోసి ప్రాణాలు తీయడం స్థానికంగా కలకలం రేపింది.

ఘటనకు సంబంధించిన ముఖ్య అంశాలు:

పథకం ప్రకారమే దాడి:లి బాధితురాలు కీర్తన తల్లిదండ్రులు ఉపాధి కోసం కూలి పనులకు వెళ్లిన సమయాన్ని నిందితుడు ఆవుల వెంకటేష్ (19) ఆసరాగా చేసుకున్నాడు. ఇంట్లో కీర్తన ఒంటరిగా ఉందని తెలుసుకుని, వెంట తెచ్చుకున్న కత్తితో ఒక్కసారిగా ఆమెపై దాడి చేసి గొంతుకోశాడు. తీవ్ర రక్తస్రావంతో విలవిలలాడుతున్న కీర్తనను గమనించిన ఇరుగుపొరుగు వారు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. హుటాహుటిన ఆమెను కడప రిమ్స్ ఆసుపత్రికి తరలిస్తుండగా, పరిస్థితి విషమించి మార్గమధ్యలోనే కీర్తన మృతి చెందింది.

నిందితుడి నేపథ్యం: హత్యకు పాల్పడిన వెంకటేష్ ఆంజనేయ కొట్టాలకు చెందినవాడని, ప్రస్తుతం డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడని సమాచారం. ప్రేమ పేరుతో వేధించి, చివరకు ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్లు తెలుస్తోంది. హత్య చేసిన అనంతరం అక్కడి నుండి పరారైన వెంకటేష్‌ను స్థానిక పోలీసులు వేగంగా స్పందించి అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం అతడిని విచారిస్తున్నట్లు సమాచారం.

కాలనీలో మిన్నంటిన రోదనలు:

చదువుకుని ప్రయోజకురాలు అవుతుందనుకున్న కూతురు విగతజీవిగా పడి ఉండటంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. అగ్రహారం కాలనీలో విషాదఛాయలు అలముకున్నాయి. ఇలాంటి దారుణానికి ఒడిగట్టిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని, బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని కాలనీవాసులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు.

## మహిళా బిల్లుకు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు

ఎందుకు? మహిళా రిజర్వేషన్లను నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్)తో ఎందుకు లింకు పెడుతున్నారని ఆయన ప్రశ్నించారు.

తక్షణ అమలు సాధ్యమే: ప్రస్తుతం ఉన్న 543 పార్లమెంట్ స్థానాల్లోనే మహిళా రిజర్వేషన్లను అమలు చేయొచ్చని, అలా చేస్తే ఎవరూ అడ్డుపడరని ఆయన సూచించారు.

ఓబీసీ కోటా డిమాండ్: 33 శాతం మహిళా రిజర్వేషన్లలో ఓబీసీ ఉప కోటాను కూడా తప్పనిసరిగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

**ఉత్తర - దక్షిణాది మధ్య చిచ్చు!**

ఆర్థిక అంశాలతో పాటు ఇప్పుడు రాజకీయంగా కూడా ఉత్తర మరియు దక్షిణాది రాష్ట్రాల మధ్య అంతరం పెంచాలని బీజేపీ చూస్తోందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. “కేవలం ఐదు రాష్ట్రాలతోనే కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయాలనేది బీజేపీ ఆలోచనగా కనిపిస్తోంది. ఎన్డీఏ చెప్తున్న లెక్కలు ఉత్తర-దక్షిణాది రాష్ట్రాల మధ్య పెద్ద రాజకీయ అంతరాన్ని సృష్టించనున్నాయి.”

లిరేవంత్ రెడ్డి, తెలంగాణ ముఖ్యమంత్రి

## తుపాకి వీడి..ప్రగతి బాట పట్టి

పోలీసులకు అప్పగించారు.

ప్రాబల్యం తగ్గుముఖం: డీజీపీ విశ్లేషణ

ఈ సందర్భంగా డీజీపీ శివధర్ రెడ్డి మావోయిస్టు పార్టీ బలహీనపడిన తీరును గణాంకాలతో వివరించారు

సెంట్రల్ కమిటీ: ఒకప్పుడు తెలంగాణ నుంచి 11 మంది ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 2కు పడిపోయింది.

స్టేట్ కమిటీ:24 మంది సభ్యుల నుంచి ప్రస్తుతం కేవలం ఇద్దరు మాత్రమే మిగిలారు.

డివిజన్ కమిటీ: 36 మంది నుంచి ఒక్కరికి చేరుకుంది.

దళ సభ్యులు:గతంలో 30 మంది ఉండగా, ప్రస్తుతం తెలంగాణలో దళ సభ్యులెవరూ లేరని డీజీపీ స్పష్టం చేశారు.

రూ. 1.93 కోట్లతో భారీ పునరావాసం

జనజీవన స్రవంతిలో కలిసిన వారికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని డీజీపీ ప్రకటించారు. లొంగిపోయిన 42 మందికి కలిపి మొత్తం లిరూ. 1.93 కోట్ల రూపాయలలి నగదు ప్యాకేజీని అందజేస్తున్నట్లు తెలిపారు. స్టేట్ కమిటీ సభ్యులకు రూ. 20 లక్షలు, డివిజనల్ కమిటీ కార్యదర్శులకు రూ. 8 లక్షల చొప్పున ప్రభుత్వం అందజేస్తోంది. కేంద్ర హోంశాఖ మార్గదర్శకాల ప్రకారం.. ఎల్ఎమ్‌జీ అప్పగిస్తే రూ. 5 లక్షలు, ఏకే-47కు రూ. 4 లక్షలు, ఎస్ఎల్ఆర్‌కు రూ. 2 లక్షల చొప్పున అదనపు రివార్డులు ప్రకటించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు వీరికి ప్రత్యేక ఆరోగ్య కార్డులను కూడా పంపిణీ చేయనున్నారు.

గణపతికి పోలీసుల పిలుపు

గత ఏడాదిన్నర కాలంలో 763 మంది మావోయిస్టులు లొంగిపోయారని డీజీపీ వెల్లడించారు. అగ్రనేత గణపతి సహా ఇంకా అజ్ఞాతంలో ఉన్న మరో ఐదుగురు రాష్ట్ర నేతలు కూడా వెంటనే లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలవాలని ఆయన ఈ సందర్భంగా ఆహ్వానించారు.

## గగన్‌యాన్ ‘ఎయిర్ డ్రాప్’ టెస్ట్ సక్సెస్

**శ్రీహరి కోట ఏప్రిల్ 10:** గగన్‌యాన్ మిషన్‌లో వ్యోమగాములు ప్రయాణించే లి'క్రూ మాడ్యూల్'లి నింగి నుంచి భూమికి తిరిగి వచ్చేటప్పుడు ఎంత సురక్షితంగా ల్యాండ్ అవుతుందో పరిశీలించే పరీక్షే ఈ ‘ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డ్రాప్ టెస్ట్’ వ్యోమగాముల రక్షణ మరియు పారాచూట్ వ్యవస్థ పనితీరును పరీక్షించడమే ప్రధాన లక్ష్యంఅత్యవసర సమయాల్లో సిబ్బందిని సురక్షితంగా తప్పించే సామర్థ్యాన్ని ఇది నిర్ధారిస్తుంది.

**పరీక్ష జరిగిన తీరు: కీలక విశేషాలు**

శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌లో జరిగిన ఈ ప్రయోగంలో పలు విభాగాల సమన్వయం కనిపిస్తుంది గతంలో లాగే ఈసారి కూడా భారత వాయుసేనకు చెందిన భారీ వాహక హెలికాప్టర్ (సాధారణంగా చినూక్) ద్వారా క్రూ మాడ్యూల్‌ను నిర్ణీత ఎత్తుకు తీసుకెళ్లి గాలిలో వదిలేశారు. సుమారు 5 టన్నుల బరువు ఉండే ఈ మాడ్యూల్, వాతావరణ ఘర్షణను తట్టుకుంటూ పారాచూట్ల సాయంతో నెమ్మదిగా దిగాల్సి ఉంటుంది. ఈ ప్రయోగంలో ఇస్రో తో పాటు ఐఏఎఫ్, డీఆర్డీవో, భారత నౌకాదళం మరియు కోస్ట్ గార్డ్ సిబ్బంది పాలుపంచుకున్నారు.

**మంత్రి జితేంద్ర సింగ్ ప్రశంసలు**

కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి జితేంద్ర సింగ్ ఇస్రో శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలుపుతూ కీలక వ్యాఖ్యలు చేశారు:

“ఈ విజయం గగన్‌యాన్ మిషన్ పట్ల ఇస్రోకున్న సంసిద్ధతను చాటిచెప్పింది. వచ్చే ఏడాది భారతీయులను అంతరిక్షంలోకి పంపే లక్ష్యానికి మనం మరింత చేరువయ్యాం.”

**ఇది ఎందుకు అంత కీలకం?**

వ్యోమగాములు భూమికి తిరిగి వచ్చేటప్పుడు వాతావరణంలోకి ప్రవేశించినప్పుడు విపరీతమైన వేడి, ఒత్తిడి ఉత్పన్నమవుతాయి. ఆ సమయంలో పారాచూట్లు సరైన సమయంలో విచ్చుకోకపోతే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఈ రోజు జరిగిన విజయవంతమైన పరీక్షతో లిపారాచూట్ డిప్లాయ్‌మెంట్ వ్యవస్థలి పక్కాగా ఉందని రుజువైంది. ఇది భారతీయ వ్యోమగాములకు ఇచ్చే అతిపెద్ద భద్రతా హామీ.

## దేశంలో తొలి డిజిటల్ జనగణన సందడి

స్వయంగా వివరాలు నమోదు చేసుకునేందుకు ఏప్రిల్ 16 నుంచి ఏప్రిల్ 30 వరకు అవకాశం కల్పించారు. అనంతరం మే నెల అంతా ప్రభుత్వ సిబ్బంది ప్రతి ఇంటికి వచ్చి వివరాలను సేకరిస్తారు.

**తెలంగాణ:** తెలంగాణలో ఏప్రిల్ 26 నుంచి మే 10 వరకు ప్రజలు తమ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. మే 11 నుంచి జూన్ 9వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో సిబ్బంది ఇంటింటికీ వచ్చి వివరాలను ధృవీకరిస్తారు.

**గణనలో అడిగే వివరాలు:** ఈ గృహ గణనలో ప్రతి కుటుంబాన్ని మొత్తం ముప్పై మూడు ప్రశ్నలు అడుగుతారు. ఇందులో కుటుంబ పెద్ద పేరు, లింగం, ఇంటి యాజమాన్య హక్కులు, త్రాగునీరు, విద్యుత్ వంటి కనీస వసతుల గురించి సమాచారాన్ని సేకరిస్తారు. ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఈ వివరాలను నమోదు చేసే సమయంలో ఎటువంటి ధృవీకరణ పత్రాలను సమర్పించాల్సిన లేదా అప్‌లోడ్ చేయాల్సిన అవసరం లేదు.

**రెండు దశల్లో జనగణన:** ఈ భారీ ప్రక్రియను రెండు దశల్లో పూర్తి చేయనున్నారు. మొదటి దశలో ఏప్రిల్ నుండి సెప్టెంబర్ వరకు అన్ని ప్రాంతాల్లో గృహ గణన జరుగుతుంది. రెండో దశ 2027 ఫిబ్రవరిలో ప్రారంభమవుతుంది. అయితే వాతావరణ పరిస్థితుల దృష్ట్యా జమ్మూకశ్మీర్, లడఖ్, హిమాచల్ ప్రదేశ్ వంటి ప్రాంతాల్లో మాత్రం 2026 సెప్టెంబర్‌లోనే రెండో దశ పనులను మొదలుపెడతారు. మొత్తం మీద ఈ జనగణన పూర్తిగా కాగితం రహితంగా, మొబైల్ యాప్‌ల ద్వారా డిజిటల్ పద్ధతిలో జరగడం గమనార్హం.ఈ నూతన పద్ధతి ద్వారా సమయం ఆదా అవ్వడమే కాకుండా, దేశ ప్రణాళికల రూపకల్పనకు అవసరమైన ఖచ్చితమైన సమాచారం అందుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈ డిజిటల్ విప్లవంలో భాగస్వాములు కావాలని ప్రభుత్వం ప్రజలను కోరుతోంది.

## దేశ భద్రతలో రాజీ లేదు

**బెంగాల్ ఏప్రిల్ 10:** రాష్ట్రంలోని ప్రతి మహిళకు మరియు నిరుద్యోగ యువతకు నెలకు లిరూ.3,000లి చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని వాగ్దానం చేసింది. పోలీసు విభాగంతో సహా అన్ని ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు లి33 శాతం రిజర్వేషన్లలి కల్పిస్తామని స్పష్టం చేసింది. అధికారంలోకి వచ్చిన కేవలం 45 రోజుల్లోనే ప్రభుత్వ ఉద్యోగుల కోసం లిఏడవ వేతన సంఘాన్నిలి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చింది.

**చొరబాట్లపై ఉక్కుపాదం: ‘గుర్తించడం - తొలగించడం - పంపించివేయడం’**

సరిహద్దు భద్రత మరియు చొరబాట్లను ప్రధాన అంశాలుగా బీజేపీ తన మేనిఫెస్టోలో పొందుపరిచింది. చొరబాటుదారుల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడేది లేదని, వారిని గుర్తించి, జాబితా నుండి తొలగించి, దేశం వెలుపలికి పంపించే విధానాన్ని అమలు చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. పశువుల అక్రమ రవాణాకు స్వస్తి పలికి, సరిహద్దులను పూర్తిస్థాయిలో సురక్షితం చేస్తామని వాగ్దానం చేశారు.

**‘సోనార్ బంగ్లా’ దిశగా రోడ్ మ్యాప్**

ఈ సంకల్ప పత్రం కేవలం ఎన్నికల ప్రణాళిక మాత్రమే కాదని, బెంగాల్ సంస్కృతిని గౌరవిస్తూ ‘బంగారు బెంగాల్’ సృష్టికి ఒక మార్గదర్శి అని అమిత్ షా అభివర్ణించారు. రాష్ట్రంలోని పౌరులందరికీ ఒకే విధమైన చట్టం వర్తించేలా చర్యలు తీసుకుంటామని, అదే సమయంలో ప్రతి ఒక్కరూ తమ మతాన్ని స్వేచ్ఛగా ఆచరించేలా రక్షణ కల్పిస్తామని పేర్కొన్నారు.గత 15 ఏళ్ల తృణమూల్ కాంగ్రెస్ పాలన ప్రజలకు పీడకలగా మారిందని, ఆ అరాచకానికి ముగింపు పలికేందుకే ఈ ప్రణాళికను సిద్ధం చేశామని తెలిపారు.

## జలవిషాదం

**మథుర, ఏప్రిల్ 10:** ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన మథుర జిల్లాలో శుక్రవారం ఘోర ప్రమాదం సంభవించింది. బృందావన్‌లోని యమునా నదిలో ప్రయాణిస్తున్న పర్యాటకుల పడవ బోల్తా పడటంతో కనీసం 10 మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రమాద సమయంలో పడవలో మొత్తం 25 మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

**క్షణాల్లో జరిగిన ఘోరం:** శుక్రవారం మధ్యాహ్నం పర్యాటకులు నదిలో విహరిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. సామర్థ్యానికి మించి పర్యాటకులు పడవలో ఉండటమే ప్రమాదానికి ప్రాథమిక కారణమని భావిస్తున్నారు. ప్రవాహ వేగానికి పడవ ఒక్కసారిగా పక్కకు ఒరిగిపోవడంతో ప్రయాణికులంతా నదిలో పడిపోయారు. స్థానికులు వెంటనే స్పందించి కొందరిని రక్షించినప్పటికీ, అప్పటికే పది మంది మృతి చెందారు.

**ముమ్మరంగా గాలింపు చర్యలు:** సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగాయి. నదిలో గల్లంతైన మిగిలిన వారికోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఇప్పటివరకు 10 మృతదేహాలను వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులను చికిత్స కోసం సమీపంలోని వైద్యశాలల్లో చేర్పించారు.

**విషాదంలో పర్యాటక కుటుంబాలు**

దైవ దర్శనం కోసం వచ్చి, ఇలా జలసమాధి అవ్వడంతో మృతుల కుటుంబాల్లో తీరని విషాదం నెలకొంది. ఈ ఘటనపై ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. లైఫ్ జాకెట్లు లేకపోవడం, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం వంటి నిబంధనల ఉల్లంఘనపై ఆరా తీస్తున్నారు. గల్లంతైన వారిలో మరికొందరు మరణించి ఉండవచ్చనే ఆందోళన వ్యక్తమవుతోంది



## సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడితే కఠిన చర్యలు

### – కోరుట్ల మున్సిపల్ కమిషనర్ రవీందర్

**కోరుట్ల, ఏప్రిల్ 10 :** కోరుట్ల నియోజకవర్గం పట్టణంలో మున్సిపల్ కమీషనర్ రవీందర్ ఆదేశాల మేరకు కోరుట్ల పట్టణంలోని రెస్టారెంట్లు హోటల్స్, టిఫిన్ సెంటర్లు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి వారు. వినియోగిస్తున్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్, నిలువ ఉంచిన ఆహార పదార్థాలను స్వాధీన పరుచుకొని రూ.లు 12,000 జరిమానాలు విధించడంతో పాటు బట్ట సంచుల వాడకంపై అవగాహన కల్పించారు. అలాగే ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ చెయ్యని దుకాణా దారులకు ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ చేసుకోవాలని వివరించారు.దీనిని ఉదేశించి మున్సిపల్ కమీషనర్ రవీందర్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను పూర్తిస్థాయిలో నిషేదించాలి లేనియెడల భారీ జరిమానాలు విధించడంతో పాటు దుకాణాలు సీజ్ చేయడం జరుగుతుందన్నారు. ట్రేడ్ లైసెన్స్ లేని వారు వెంటనే తీసుకోవాలి అని ఆయన స్పష్టం చేశారు. వ్యాపార కార్యకలాపాలతో వెలువడిన చెత్తను తడి, పొడి,హానికరక చెత్తగా వేరు చేసి షాప్ వద్దకు వచ్చే మున్సిపల్ వాహనాలకు అందించాలని తెలిపారు లేనిచో వాఅవీ-2019 చట్టం ప్రకారం జరిమానా విధించబడునన్నారు.ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్లు రాజేంద్రప్రసాద్ , ఇంచార్జ్ సానిటరీ ఇన్స్పెక్టర్ అశోక్, రికార్డ్ అసిస్టెంట్ జగదీష్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మహేష్, హేమంత్, జవాన్లు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



# రుక్మాపూర్ గ్రామంలో ఐకెపి వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభం

### 24 గంటల్లో రైతుల ఖాతాలో డబ్బులు ఏపిఎం దుర్గాప్రసాద్

**చేగుంట ఏప్రిల్ 10 మెదక్ టుడే న్యూస్** చేగుంట మండలం రుక్మాపూర్ గ్రామంలో ఐకెపి వడ్ల కొనుగోలు కేంద్రాన్ని మహిళా సంఘాల అధ్యక్షురాలు శ్రీమతి మౌనిక రేంజర్ల లక్ష్మి సి ఎ బోయిని స్వామి, ఏపీఎం దుర్గాప్రసాద్ సిసి అంజయ్య ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడం జరిగింది ప్రారంభోత్సవాన్ని ఉద్దేశించి సర్పంచ్ నవీన్ మాట్లాడుతూ గ్రామ రైతులు ఐకెపి ద్వారా మన గ్రామంలో పెట్టిన ఈ కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాంచనపల్లి నవీన్,ఉపసర్పంచ్ కొలుపుల రామస్వామి,పంచాయతీ కార్యదర్శి బాలు, వార్డు సభ్యులు శ్రీరామ్,మహేష్, రమేష్, మాజీ వార్డు నెంబరు నీల రాములు,గ్రామ పెద్దలు రైతులు కట్ట అంజయ్య గౌడ్, గాండ్ల సత్యం, మాచి నపల్లి రమేష్,మేకల బాలరాజు,కృష్ణారెడ్డి,చంద్రం, కట్ట శేఖర్, గౌడ్ , గజ్జల శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.




# వడ్ల ఐకెపి సెంటర్ ను ప్రారంభించిన అధికారులు మూడు గ్రామాల సర్పంచులు

**చేగుంట ఏప్రిల్ 10 మెదక్ టుడే న్యూస్** చేగుంట మండల, రాంపూర్ కేంద్రంలో ప్రభుత్వం ప్రత్యేకంగా రైతుల కోసం ఏర్పాటు చేసిన ధాన్యం సేకరణ కేంద్రం ను గ్రామ సర్పంచ్ మరియు అధికారులతో కలిసి ఐకెపి సెంటర్ ను ప్రారంభించి రైతులు పండించిన పంటను దళారులకు కాకుండా ప్రభుత్వ ఐకెపి సెంటర్ లో పంటను అమ్మాలని దళారులను అమ్మి మోసపోకండి వారు సందేశానిచారు. ప్రభుత్వం సన్న వోడ్లకు క్వింటాల్ కు 500 బోనస్ ఇవ్వడం జరుగుతుందని వారు తెలియజేశారు. ఈ సందర్భంగా , రాంపూర్ గ్రామ సర్పంచ్ కాశబోయిన నాగమణి సుదర్శన్ ఉప సర్పంచ్ కాశబోయిన, సిద్ధిరాములు వార్డ్ మెంబర్స్ సిహెచ్ అశోక్ కన్యారం సర్పంచ్ కర్రె పుష్ప శంకర్ సోమల తండా సర్పంచ్ మాలోత్, ప్రవలిక రమేష్ కన్యారం ఉపసర్పంచ్, మోహన్ వార్డ్ నెంబర్స్ తయబ్ కొలుపులస్వామి నాగరాజుగౌడ్ శ్రీను సిసి శంకర్, రాంపూర్ వివో కే. బాలమణి కన్యారం సి ఏ శ్రావణి మధు రాంపూర్ సిఏ కే. రజిత రైతులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు



# ఇందిరమ్మ ఇళ్లు గృహ ప్రవేశం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న చెరుకు శ్రీనివాస్ రెడ్డి

### పేదోడి కళ నిజం చేస్తూ వారికి ఐదు లక్షల రూపాయలు సహాయం అందిస్తున్న ప్రభుత్వం మా కాంగ్రెస్ ప్రభుత్వం చెరుకు శ్రీనివాస్ రెడ్డి

**చేగుంట ఏప్రిల్ 10 మెదక్ టుడే న్యూస్**చేగుంట మండలం చేగుంట గ్రామానికి చెందిన పెండ్యాల పద్మ కిష్టయ్య వారి ఇందిరమ్మ ఇల్లు నూతన గృహప్రవేశ వేడుకలలో పాల్గొన్న చెరుకు శ్రీనివాస్ రెడ్డి ప్రజా ప్రభుత్వం ప్రత్యేకంగా పేదోడి కల సాకారం చేస్తూ వారికి 5 లక్షల రూపాయలు సహాయం అందిస్తు నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లు ను చేగుంట పట్టణ కేంద్రంలో గ్రామ సర్పంచ్ తో కలిసి నూతన ఇందిరమ్మ ఇళ్లు గృహ ప్రవేశం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న దుబ్బాక నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఈ సందర్భంగా చేగుంట ఎఎంసి ఛైర్మెన్ తాడేం వెంగళరావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్, చేగుంట సర్పంచ్ సంద్రుగు స్రవంతి సతీష్, ఉపసర్పంచ్ రఫీ, ఎఎంసి డైరెక్టర్లు స్టాలిన్ నర్సింలు, శ్రీనివాస్, బాల్ రెడ్డి, అన్నం ఆంజనేయులు, మండల ఉపాధ్యక్షులు యం శ్రీనివాస్, వడియారం సర్పంచ్ సాయి కుమార్ గౌడ్,సీనియర్ నాయకులు అయిత పరంజ్యోతి,యువ నాయకులు సంద్రుగు శ్రీకాంత్, నదిమ్,జగన్ గౌడ్, చిన్న శివునూరు ఉపసర్పంచ్ బొల్ల ప్రశాంత్,గ్రామ వార్డు సభ్యులు,కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు



# ఐకేపీ కొనుగోలు కేంద్రం ను ప్రారంభించిన మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్

**చేగుంట ఏప్రిల్ 10, మెదక్ టుడే న్యూస్**చేగుంట మండలం చందాయిపేట్ గ్రామం లో ఐకేపీ సెంటర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం నాడు గ్రామ సర్పంచ్ తాలూకా మహేశ్వరీ సాయిబాబా వ్యవసాయ అధికారి హరిప్రసాద్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించిన వడ్లను కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి, మద్దతు ధర పొందాలని సూచించారు. దళారులకు ధాన్యం అమ్మి మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమం లో చేగుంట వ్యవసాయ అధికారి హరిప్రసాద్, ఏపీఓ దుర్గాప్రసాద్,మార్కెట్ కమిటీ డైరెక్టర్ మొహమ్మద్ ముజామిల్, అన్నం ఆంజనేయులు, గ్రామ సెక్రటరీ కృష్ణ, జి పి ఓ, రాత్నకుమారి,ఏపీఎం దుర్గ ప్రసాద్, సీసీ స్వామి,ఏ ఈ ఓ భువనేశ్వరి, వి ఓ ఏ స్వామి,వార్డ్ మెంబెర్స్, గ్రామ రైతులు, ఆనందాస్ ఆంజనేయులు, ఆక్బార్, మధు, మల్లేష్, రాజు,ఆశా వర్కర్స్, వివో లీడర్స్,తదితరులు పాల్గొన్నారు.



# ఎనిమిదేళ్ల తర్వాత ఎక్సైజ్ శాఖలో భారీగా బదిలీలు

**హైదరాబాద్, ఏప్రిల్ 10 :** దాదాపు ఎనిమిదేళ్ల తర్వాత భారీగా బదిలీలు చేపట్టింది ఎక్సైజ్ శాఖ. డిపార్టుమెంట్ లో మొత్తం 1912 మంది సిబ్బందిని బదిలీ చేస్తున్నట్లు 2026 ఏప్రిల్ 10న ఉత్తర్వులు జారీ చేసింది. 2018 తర్వాత ఇంత పెద్ద ఎత్తున ట్రాన్స్ఫర్లు చేపడుతున్నారు. జోన్ వారీగా హెడ్ కానిస్టేబుళ్లను, జిల్లా వారీగా కానిస్టేబుళ్ల బదిలీలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. శాఖలో మొత్తం 326 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 1586 మంది కానిస్టేబుళ్లను బదిలీ చేశారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులను ఎక్సైజ్ శాఖ కమిషనర్ జారీ చేశారు. బదిలీ అయిన ఉద్యోగులు మూడు రోజుల్లో కొత్త స్థానాల్లో చేరాలని ఆదేశించారు. ప్రభుత్వం మార్గదర్శకాల మేరకు ప్రక్రియ పూర్తి చేసినట్లు తెలిపారు.ఎక్సైజ్ శాఖలో బదిలీ ప్రక్రియ ఏప్రిల్ 4 నుంచి 10 వరకు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా 2 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసిన వారికి ప్రాధాన్యం ఇచ్చారు. సీనియారిటీ ఆధారంగా బదిలీలు చేపట్టినట్లు ఉన్నతాధికారులు తెలిపారు. పరిపాలన సుగమం చేసేందుకు బదిలీలు చేపట్టినట్లు ఈ సందర్భంగా తెలిపారు.

# పంచాయతీరాజ్ చట్టం అవగాహనా పై వార్డు మెంబర్లకు ముగిసిన శిక్షణ

**కోరుట్ల, ఏప్రిల్ 10 :** కోరుట్ల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 5 రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమం శుక్రవారం ఏపీవో ఆధ్వర్యంలో నిర్వహించారు. నూతనంగా ఎన్నిక కాబడిన వార్డు మెంబర్లకు శిక్షణ కార్యక్రమం ముగిసింది. ఇందులో భాగంగా వార్డు మెంబర్లకు పంచాయతీరాజ్ చట్టం గ్రామ పంచాయతీకి సంబంధించిన పరిపాలనలో వారి పాత్ర భాద్యతలపై శిక్షణ ఇచ్చి వారికి సర్టిఫికెట్ లు పంపిణి చేశారు. ఇట్టి శిక్షణ కార్యక్రమంలో ఎంపీవో రాజశేఖర్, చక్రధర్ కార్యాలయ పర్యవేక్షకులు, మమత ఏపీవో, టి వో టి లు అపర్ణ, పూజిత, రవీందర్ ఆదిరెడ్డి వివిధ గ్రామాల వార్డ్ మెంబర్లు పాల్గొన్నారు.



# టీజీ ఆర్టీసీ పోస్టుల నియామకాలు..

**హైదరాబాద్, ఏప్రిల్ 10 :** టీజీ ఆర్టీసీలో డ్రైవర్, శ్రామిక్ పోస్టుల భర్తీ ప్రక్రియ తుది దశకు చేరుకుంది. మొత్తం 1,632 ఖాళీలకు 54,901 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయడంతో భారీ పోటీ నెలకొంది. ఈనెల 23 నుంచి సర్టిఫికేట్ వెరిఫికేషన్ తో పాటు డ్రైవింగ్ టెస్టు నిర్వహించనున్నట్లు రాష్ట్ర పోలీస్ నియామక బోర్డు (టీఎస్ఎల్పీఆర్బీ) చైర్మన్ వి.వి. శ్రీనివాసరావు వెల్లడించారు. ఈ మేరకు గురువారం నోటిఫికేషన్ విడుదల చేశారు. హైదరాబాద్ మేడ్చల్లోని పోలీస్ ట్రైనింగ్ కాలేజీ వేదికగా ఈ ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు. డ్రైవర్ పోస్టులకు దరఖాస్తు చేసిన 28,903 మంది అభ్యర్థులకు శారీరక కొలతల పరీక్షలు, సర్టిఫికెట్ వెరిఫికేషన్, డ్రైవింగ్ టెస్టులు ఉంటాయని వెల్లడించారు. శ్రామిక్ పోస్టులకు అప్లై చేసిన 25,998 మందికి మాత్రం వెయిటేజీ మార్కుల కేటాయింపు కోసం కేవలం సర్టిఫికెట్ వెరిఫికేషన్ మాత్రమే ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు.



**ఈ నెల 13 నుంచి అడ్మిట్ కార్డులు..**

ఈ నెల 13 ఉదయం 8 గంటల నుంచి 22 వ తేదీ అర్ధరాత్రి 12 గంటల వరకు అధికారిక వెబ్ సైట్ ఝఝఝ.ౖఠటజూతీఎ.ఱఅ ద్వారా డౌన్లోడ్ చేసుకునే అవకాశం కల్పించారు. అడ్మిట్ కార్డులు పొందడంలో ఇబ్బందులు ఎదురైతే ంబజూజూ శీతీ౯ంశ్రీజూతీఎ.ఱఅ కు ఈమెయిల్ చేయాలని లేదా పనిదినాల్లో ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5:30 గంటల మధ్య 9391005006 నంబరును సంప్రదించాలని తెలిపారు. అడ్మిట్ కార్డులో పేర్కొన్న సమయానికి కచ్చితంగా హాజరు కావాల్సి ఉంటుంది. ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలను తప్పనిసరిగా వెంట తీసుకురావాలని సూచించారు.

# జగిత్యాల రూరల్ తహసీల్దార్‌గా హాకీం నియామకం



**జగిత్యాల, ఏప్రిల్ 10 :** జగిత్యాల రూరల్ మండల నూతన తహసీల్దార్‌గా బి.ఏ. హాకీం నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా యంత్రాంగం ఉత్తర్వులు జారీ చేసింది. గత కొంతకాలంగా జగిత్యాల జిల్లా కలెక్టరేట్‌లో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏఓ)గా విధులు నిర్వహిస్తున్న హకీంను, రూరల్ మండల బాధ్యతలు చేపట్టాల్సిందిగా ప్రభుత్వం ఆదేశించింది. కలెక్టరేట్‌లో ఏఓగా తనదైన ముద్ర వేసిన ఆయన, ఇప్పుడు క్షేత్రస్థాయిలో ప్రజలకు సేవలందించేందుకు సిద్ధమయ్యారు. త్వరలోనే ఆయన బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం. హకీం నియామకం పట్ల రెవెన్యూ సిబ్బంది, పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## తెలంగాణ కొత్త డీజీపీగా సి.వి. ఆనంద్ ?

### త్వరలోనే అధికారిక ఉత్తర్వులు !



**హైదరాబాద్, ఏప్రిల్ 10 :** తెలంగాణ రాష్ట్రానికి కొత్త పూర్తిస్థాయి డీజీపీ నియామక ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ప్రస్తుతం ఇన్‌చార్జ్ డీజీపీగా ఉన్న బి. శివధర్ రెడ్డి ఈ నెల 31న పదవీ విరమణ చేయనుండటంతో, 1991 బ్యాచ్ ఐపీఎస్ అధికారి సి.వి. ఆనంద్ తదుపరి డీజీపీగా బాధ్యతలు చేపట్టే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. యూపీఎస్సీ సిఫార్సు చేసిన ముగ్గురు అధికారుల ప్యానెల్‌లో సి.వి. ఆనంద్, వినాయక ప్రభాకర్ ఆప్టే, సౌమ్య మిశ్రాల పేర్లు ఉన్నాయి. సీనియారిటీ, రాష్ట్రంలో సుదీర్ఘ అనుభవం దృష్ట్యా సి.వి. ఆనంద్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాధాన్యత ఇస్తున్నట్లు సమాచారం. ఈ నెల 14వ తేదీ తర్వాత అధికారిక ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది.

## పలు వివాహా వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే భోజ్జు దంపతులు

**ఇంద్రవెల్లి, ఏప్రిల్ 10 :** ఇంద్రవెల్లి మండలంలోని పిప్రి లో కుడ్మెత వారి వివాహానికి మరియు ఇంద్రవెల్లి ఏఎంసీ డైరెక్టర్ గారి కూతురి వివాహా వేడుకకు ఖానాపూర్ శాసనసభ్యుడు, నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు వెడ్మ భోజ్జు పటేల్ దంపతులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఇంద్రవెల్లి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## కొండగట్టు అంజన్న ను దర్శించుకున్న సినీ నటుడు సాయిధరమ్ తేజ్

**జగిత్యాల, ఏప్రిల్ 10 :** జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానాన్ని ప్రముఖ తెలుగు చలనచిత్ర నటుడు సాయిధరమ్ తేజ సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు అర్చకులు వేదమంత్ర ఉత్సరణతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనం అనంతరం ఆలయ అర్చకులు సాయిధరమ్ తేజకు వేదోక్త ఆశీర్వచనం అందజేశారు. ఆలయ ఈ.ఓ ఎస్.అంజనారెడ్డి శాలువా కప్పి సత్కరించి, లడ్డు ప్రసాదం అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సీఐ నీలం రవి, ఆలయ పర్యవేక్షకులు ఉపాధ్యాయ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## అధికారుల కళ్లు తెరిపించేందుకే కళ్లకు గంతలు.. మూడో రోజుకు చేరిన విద్యుత్ ఆర్టిజన్ల సమ్మె!

**పటాన్ చెరు ఏప్రిల్ 10(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి** తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ పటాన్‌చెరు విద్యుత్ డివిజన్ కార్యాలయం ముందు విద్యుత్ ఆర్టిజన్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె శుక్రవారం నాటికి మూడవ రోజుకు చేరుకుంది. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా విధులను బహిష్కరించి ఆందోళన చేస్తున్న కార్మికులు, నేడు తమ కళ్లకు నల్ల గంతలు కట్టుకుని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. మూడు రోజులుగా శాంతియుతంగా ఆందోళన చేస్తున్నా అధికారుల తీరులో మార్పు రాకపోవడంపై కార్మికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ, ఏళ్ల తరబడి విద్యుత్ రంగమే శ్వాసగా పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులను ప్రభుత్వం విస్మరించడం తగదన్నారు. ఆర్టిజన్లను రెగ్యులరైజ్ చేయాలని, ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్ అమలు చేయాలని మరియు పెండింగ్‌లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. తాము కష్టపడుతున్నా అధికారులకు తమ సమస్యలు కనిపించడం లేదని, అందుకే కళ్లకు గంతలు కట్టుకుని వారి కళ్లు తెరిపించే ప్రయత్నం చేస్తున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

హెచ్చరిక:అధికారులు తక్షణమే స్పందించి చర్చలు జరపకపోతే, రాబోయే రోజుల్లో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. విధులను పూర్తిగా స్తంభింపజేసి, తమ హక్కులు సాధించుకునే వరకు వెనక్కి తగ్గేదే లేదని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జేఏసీ పటాన్‌చెరు అధ్యక్షులు పార్వయ్య, కార్యదర్శి రఘు, భూపాల్ రెడ్డి, గోపి, రబ్బా, అమీర్, రవీందర్ నాయక్, అరుణ్ రెడ్డి, సాయి గౌడ్, కవిత, శివలీల, నవీన్ చారి తదితర నాయకులు మరియు పెద్ద సంఖ్యలో ఆర్టిజన్ ఉద్యోగులు పాల్గొన్నారు.





## క్రీడలు నిత్య జీవితంలో భాగం కావాలి

### పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

### భానూరులో ఘనంగా ప్రారంభమైన టంగుటూరి అంజయ్య స్మారక క్రికెట్ టోర్నమెంట్

**పటాన్‌చెరు ఏప్రిల్ 10 (మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి** ప్రస్తుత పోటీ ప్రపంచంలో మనిషి నిత్య జీవితంలో క్రీడలు భాగం కావాలని పటాన్‌చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం భానూరు గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి టంగుటూరి అంజయ్య స్మారకార్థం ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరై..ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన జీవితాన్ని పేద, కార్మిక, కర్షక వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన మహోన్నత నేత టంగుటూరి అంజయ్య అని కొనియాడారు. అంతటి గొప్ప వ్యక్తిని స్మరిస్తూ కిడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. యువత మత్తుపదార్థాల జోలికి వెళ్లకుండా క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి. వెంకట్ రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, క్రీడా పోటీల నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.






## ఘనంగా కేఎస్ పీపీ 4వ స్నాతకోత్సవం

### ముఖ్య అతిథిగా నీతి ఆయోగ్ పూర్వ సీఈవో

### 35 మంది పట్టాల ప్రదానం

### నలుగురు ప్రతిభావంతులకు బంగారు పతకాలు బహుకరణ

**పటాన్ చెరు ఏప్రిల్ 10 (మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి** కౌటిల్యా స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ (కేఎస్ పీపీ) తన నాలుగో స్నాతకోత్సవాన్ని ఏప్రిల్ 10, 2026న హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమం ఒక లాంఛనప్రాయ విద్యా ఊరేగింపు (అకడమిక్ ప్రొసెషన్)తో ప్రారంభమై, సందర్భానికి తగ్గ గౌరవప్రదమైన వాతావరణాన్ని కల్పించింది.ఈ వేడుకలో నీతి ఆయోగ్ పూర్వ ముఖ్య కార్యనిర్వహణాధికారి, భారతదేశపు జీ-20 షెర్పా అమితాబ్ కాంత్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తన ప్రసంగంలో, ఆయన నూతన ఆవిష్కరణలు, సమగ్రత, దేశ నిర్మాణానికి ప్రాధాన్యత నిస్తూ, ప్రజా విధానం, పరిపాలనకు అర్థవంతంగా దోహదపడాలని పట్టభద్రులైన విద్యార్థులను ప్రేరేపించారు. క్షేత్రస్థాయి పరిపాలన ప్రాముఖ్యతను హైలైట్ చేస్తూ, భారతదేశ సమాఖ్య నిర్మాణంలో కీలకమైన రాష్ట్రాలు, జిల్లాలతో మమేకమవ్వాలని అమితాబ్ కాంత్ విద్యార్థులను కోరారు. తయారీ రంగంలో వాటాను పెంచడం, వ్యాపార వ్యయాన్ని తగ్గించడం ద్వారా భారతదేశాన్ని ప్రపంచ తయారీ కేంద్రంగా మార్చాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. 'జన విశ్వాస్' (ప్రజా విశ్వాసం)కు ప్రాధాన్యతనిస్తూ, ఎగుమతులను పెంచడానికి, భారతదేశ ప్రపంచ పోటీతత్వాన్ని మెరుగు పరచడానికి విశ్వాసాన్ని బలపేతం చేయడం, వ్యాపార పరిస్థితులను మెరుగుపరచడం చాలా కీలకమన్నారు. భారతదేశ జనాభాలో దాదాపు 46 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారని పేర్కొంటూ, వ్యవసాయ ఉత్పాదకతను మెరుగుపరచడం యొక్క ప్రాముఖ్యతను కూడా వివరించారు. ప్రపంచ ప్రమాణాలతో భారతదేశ వ్యవసాయ, పారిశ్రామిక పనితీరును బేరీజు వేసుకోవాలని ఆయన పట్టభద్రులను ప్రోత్సహించారు.బలమైన ఆవిష్కరణ వ్యవస్థ కోసం పిలుపునిస్తూ, పరిశోధన, అభివృద్ధిని ప్రోత్సహించాలని, స్టార్టప్ లకు మద్దతు ఇవ్వాలని, రిస్క్ క్యాపిటల్ ను పొందేందుకు వీలు కల్పించాలని అమితాబ్ కాంత్ విద్యార్థులను కోరారు. 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న భారతదేశ ఆశయాన్ని ఆయన ప్రముఖంగా ప్రస్తావిస్తూ, ఈ దార్శనికతను సాధించడంలో యువ నిపుణులు కీలక పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు. భారతదేశ పురోగతిని గురించి ప్రస్తావిస్తూ, మౌలిక సదుపాయాలు, పునరుత్పాదక ఇంధనం, డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలలో వేగవంతమైన పురోగతిని ఆయన ఉదహరించారు. డిజిటల్ చెల్లింపులలో నాయకత్వం, కోడివ్-19 వ్యాక్సినేషన్ల వంటి భారీస్థాయి ప్రజా సేవల పంపిణీని కూడా ఆయన ప్రస్తావించారు. కృత్రిమ మేధస్సు, ఆరోగ్య సంరక్షణ, పోషణ వంటి రంగాలలో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ) యొక్క పరివర్తనాత్మక సామర్థ్యాన్ని ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. వర్తమాన కాలాన్ని 'భారతదేశ దశాబ్దం'గా అభివర్ణిస్తూ,




అమితాబ్ కాంత్ దేశానికి ఉన్న జనాభా పరమైన ఆధిక్యతను ఎత్తిచూపుతూ, పట్టభద్రులు ఆశావాదంతో, నూతన ఆవిష్కరణతో, దేశ నిర్మాణానికి కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు.తొలుత, ముఖ్య అతిథి,



ఇతర ప్రముఖులు సాంప్రదాయబద్ధంగా జ్యోతి ప్రజ్వలన చేయడంతో ఈ వేడుక లాంఛనంగా ప్రారంభమైంది. గీతం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్ తన అధ్యక్షోపన్యాసంలో, పట్టభద్రులను అభినందించి, ముఖ్య అతిథిని సత్కరించారు. కేఎస్ పీపీ సహ వ్యవస్థాపకుడు ప్రతీక్ కన్వాల్ అమితాబ్ ను పరిచయం చేశారు.గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు విద్యార్థి ప్రతినిధి సెహజానా కాంట్రాక్టర్ తో ప్రమాణ స్వీకారం ప్రతిని అందించి, ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం 35 మంది విద్యార్థులకు వారి డిగ్రీలతో పాటు, విద్యా నైపుణ్యాన్ని గుర్తించే మెరిట్ పతకాలను ప్రదానం చేశారు. పబ్లిక్ పాలసీ మాస్టర్స్ ప్రోగ్రామ్ లో మొదటి ర్యాంకు సాధించిన అభిజీత్ సుధీర్ రౌత్ కు అధ్యక్షుడి పేరిట నెలకొల్పిన బంగారు పతకం ఇచ్చి సత్కరించారు. ఉత్తమ క్యాప్ స్టోన్ ప్రాజెక్టుకు గాను సిమ్రాన్ కౌర్ డీన్ బంగారు పతకాన్ని అందుకున్నారు. యనమంద్ర మల్లికార్జునరావు స్మారక బంగారు పతకాన్ని అభిజీత్ సుధీర్ రౌత్, అమల్ శుక్లాలకు సంయుక్తంగా ప్రదానం చేశారు.రిజిస్ట్రార్ డాక్టర్ డి.గుణశేఖరన్, గీతం ఉప కులపతి ప్రొఫెసర్ ఎర్రోల్ డిసౌజా సంతకం కోసం డిగ్రీ రికార్డులను సమర్పించారు. విద్యార్థి ప్రతినిధి అనుష్క శర్మ స్నాతకోత్సవ ప్రసంగం చేయగా, కేఎస్ పీపీ అధ్యాపకురాలు డాక్టర్ వసుధా కడ్జు వందన సమర్పణ చేశారు. కేఎస్ పీపీ డీన్ ప్రొఫెసర్ సయ్యద్ అక్బరుద్దీన్ కూడా పాల్గొన్నారు.పబ్లిక్ పాలసీ, పరిపాలన రంగంలో తమ వృత్తి ప్రస్థానాన్ని ప్రారంభించనున్న పట్టభద్రుల బృందానికి ఈ కార్యక్రమం ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది.

printed published and owned by CHILVERA SHIVAKUMAR and printed JWAALA PRINTERS H.NO.- 10-15/1/A, KUMMARI GAINI,MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303- Gmail.
medaktoday94@gmail.com,Editor: CHILVERA SHIVAKUMAR. RNI NO, TELTEL 2023 ,88524, 9948265095.9494117870..